ప్రగతి ప్రదాతకు స్వాగతం





సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

బుధవారం 8-1-2025

సంపుటి: 20 సంచిక: 243

పేజీలు: 4 వెల: రూ.1


# ప్రగతి ప్రదాతకు స్వాగతం

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఇంధన, రైల్వే, రోడ్లు, ఔషధ & పారిశ్రామిక రంగాలకు సంబంధించి రూ. 2 లక్షల కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టుల శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు & జాతికి అంకితం చేస్తున్న కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఈరోజు విశాఖకు విచ్చేస్తున్న...

## గౌరవ ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ గారికి

## ఆంధ్రప్రదేశ్ ప్రజలందరి తరపున స్వాగతం!... సుస్వాగతం!!

### శంకుస్థాపన ప్రాజెక్టులు - అంచనా వ్యయం




పూడిమడక దగ్గర NTPC గ్రీన్ హైడ్రోజన్ హబ్
రూ. 1,85,000 కోట్లు



విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రధాన కార్యాలయ నిర్మాణం - రూ. 149 కోట్లు



రోడ్ల నిర్మాణం/విస్తరణ (10 ప్రాజెక్టులు)
రూ. 4,593 కోట్లు




కృష్ణపట్నం పారిశ్రామిక పార్క్
రూ. 2,139 కోట్లు

### ప్రారంభోత్సవం/జాతికి అంకితం



6 రైల్వే ప్రాజెక్టులు
రూ. 6,028 కోట్లు



నక్కపల్లి దగ్గర బల్క్ డ్రగ్ పార్క్
రూ. 1,877 కోట్లు



234.28 కి.మీ.ల రోడ్లు (7 ప్రాజెక్టులు)
రూ. 3,044 కోట్లు




323 కి.మీ.ల - 3 రైల్వే లైన్లు (2 రాయలసీమ ప్రాజెక్టులు)
రూ. 5,718 కోట్లు

**సాయంత్రం 4:45 గంటలకు**

విశాఖపట్నంలోని వేంకటాద్రి వంటిల్లు రెస్టారెంట్ నుండి ఏయూ ఇంజనీరింగ్ కళాశాల వరకు రోడ్ షో

**సాయంత్రం 5:30 గంటలకు**

ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో భారీ బహిరంగ సభ



## ప్రగతి బాటలో కలిసి నడుద్దాం... స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాలను చేరుకుందాం

• ఎడిటోరియల్

# దేశం ఎటుపోతోంది? ఏమైపోతోంది?

సామాజిక జీవనంలో మతవిద్వేషం బుసలు కొడుతున్న దేశాల్లో భారత్ ప్రపంచంలోనే మొదటి స్థానంలో ఉందని 'ప్యూ రీసెర్చ్ సెంటర్' తాజా నివేదిక స్పష్టం చేస్తోంది. 198 దేశాల్లో 'సామాజిక వర్గాల మధ్య శత్రుత్వ భావన (ఎస్‌హెచ్‌ఐ)' అన్న అంశంపై అధ్యయనం చేసిన ప్యూ సంస్థ తాజా ఇండెక్స్ ప్రకారం భారత్ 9.3 పాయింట్లతో తొలి స్థానంలో ఉండటం అత్యంత విషాదం. ఇలాంటి పరిస్థితుల్లో 'సామాజిక సహకారానికి, భిన్న వర్గాల మధ్య సామరస్యానికి చిచ్చు పెట్టే క్లిష్ట ప్రసంగాలు సమర్ధనీయం కాదు. ఎక్కడికక్కడ కుల, మత, ప్రాంతీయ విభేదాలు రాజేస్తూ ఓట్ల చలి మంటలు కాచుకునే విద్వేష ప్రసంగీకుల్ని అణచివేయని పక్షంలో రాజ్యాంగ విలువలు చచ్చుబడిపోతాయి' అని సర్వోన్నత న్యాయస్థానం వ్యక్తం చేసిన ఆందోళనను మరోసారి గుర్తుచేసుకోవాలి. మనుషుల్ని కులం పేరిట, మతం పేరిట, ఆహారం పేరిట ఇంకా సవాలక్ష మౌఢ్యాలతో హింసిస్తూ దేశభక్తుల ముసుగులో తిరగడం మనం నిత్యం చూస్తూనే ఉన్నాం. అసలైన దేశభక్తి మనుషులను ప్రేమించడంలో ఉందని వందేళ్ల కిందటే మహాకవి గురజాడ చెప్పిన మాటలు ఇంకా మతోన్మాదుల బుర్రకెక్కలేదు. అందుకే ఈ మహా వాక్యానికి ఇంకా ప్రాసంగిత ఉంది. మనుషుల్ని ప్రేమించడం, మానవ శ్రమతో దేశాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేసుకోవడం, స్వయం సమృద్ధిని సాధించడం, కులమత మౌఢ్యాల నుంచి విముక్తమై 'అన్నదమ్ముల వలెను జాతులు/ మతములన్నీ మెలగవలెనోయి/మతం వెరైతేను యేమోయి/ మనసులొకటై మనుషులుంటే' అని కాంక్షించిన గురజాడ దృష్టిలో దేశభక్తి అంటే ఇది. కానీ, దేశంలో అలాంటి పరిస్థితులే కరువయ్యాయని తాజా నివేదిక స్పష్టం చేస్తుంది. మొన్నటికి మొన్న సాక్షాత్తు పార్లమెంటులోనే కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాజ్యాంగ నిర్మాత మీదే అక్కసు వెళ్లగక్కారు. దేశంలోని ముస్లింలు, ఇతర మైనారిటీలకు వ్యతిరేకంగా స్వయంగా మోడీనే విద్వేష ప్రసంగాలు చేసిన సందర్భాలు కోకొల్లలు. 'ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా' అన్నట్టు ప్రభుత్వ అధినేతలే విద్వేష పూర్వక ప్రసంగాలు చేస్తుంటే వారి పరివారం కట్టడి చేయడం సాధ్యమేనా? తినే తిండి మీద ఆంక్షలు, కట్టుకునే బట్టమీద ఆంక్షలు, భావ ప్రకటనపైనా ఆంక్షలు, పుట్టిన నేలపై స్వేచ్ఛగా జీవించాలన్నా ఆంక్షలు. చివరకు బతుకుతెరువు కోసం చేసే పని మీద కూడా ఆంక్షలే! అసలు దేశం ఎటుపోతోంది? ఏమైపోతున్నది? సగటు భారతీయుని ఆవేదన ఇది. ఓవైపు ఆధునిక ప్రపంచం అంతరిక్షంలో కూడా పరిశోధనలు చేసే స్థాయికి దూసుకుపోతుంటే, దేశాన్ని మరోవైపు మతవిద్వేషాలు, మూఢనమ్మకాలు, అశాస్త్రీయ భావాలమయం చేస్తున్న తీరును ఏమనాలి? పాలకులు దేశానికి ఏం చెబుతున్నట్టు? ఏం సూచిస్తున్నట్టు? ఈ దేశం 'మీది కాదు మాది' అంటే భిన్నత్వంలో ఏకత్వంలా కలిసుండే ప్రజలు ఎక్కడివెళ్లాలి? ఇది విచ్ఛిన్న విధానం. ఇదే వ్యవస్థ ఇప్పుడు దేశంలో అమలవడం చూస్తుంటే ఆందోళనగా ఉన్నది. మరోవైపు.. చరిత్ర పుటలను మతం రంగు పులిమిన కళ్లద్దాలతో చూసేవాళ్లు.. ఉత్తుత్త పుకార్లను చరిత్రగా నమ్మేవాళ్లు.. చరిత్రను తిరగరాసే ప్రయత్నం చేస్తున్నారు. బడిలో 'భారతదేశం నా మాతృభూమి/ భారతీయులందరూ నా సహోదరులు' ప్రతిజ్ఞ చేశాం. ఇప్పుడా ప్రతిజ్ఞకు తిలోదకాలిచ్చి ఒకరినొకరు చంపుకునే దుస్థితికి దిగజారిపోయాం. మణిపూర్‌లో ఏడాదిన్నరగా జరుగుతుందదే. విద్వేష భావజాలం వెళ్లగక్కి సౌభ్రాతృత్వాన్ని చావుదెబ్బ తీసేవాళ్లపై ప్రభుత్వాలు చర్యలకు పూనుకొని ఉంటే నేడు ఇలా అగ్నిగుండంలా మారుతుందా? ఒకరికొకరై అందరొక్కటై కుల మత ప్రాంతీయ భాషా భేదాలకు అతీతంగా ఒకే జాతిగా భారతీయులు ప్రగతి పథాన పురోగమించాలని అలనాటి రాజ్యాంగ నిర్మాతలు ఆకాంక్షించారు. జరుగుతున్నదేమిటి? ఉమ్మడి భావన బీటలు వారుతోంది. సంకుచిత భావజాల ప్రచారం విభేదాలకు, సామాజిక అశాంతికి, చీలికలకు పాలుపోస్తోంది. జన సమూహాల నడుమ కత్తులు దూసుకునే శత్రుత్వాలకు, నెత్తుటేళ్లు పారించే వైషమ్యాలకు అంటుకడుతోంది. ఈ దుష్ప్రచారాన్ని క్షణాల వ్యవధిలో అసంఖ్యాకులకు చేరవేయడంలో వాట్సాప్ మాధ్యమాల యూనివర్సిటీ విద్యార్థులు తలమునకలై ఉన్నారు. అశ్లీల, అసభ్య సమాచార వాహికలుగా భ్రష్టుపట్టి పరువు మోస్తున్న సామాజిక మాధ్యమాలు విద్వేష వ్యాఖ్యల పంపిణీ ఏజెన్సీలుగా దిగజారి కలుషిత సాగరాల్ని తలపిస్తున్నాయి. తద్వారా వాటిల్లే విపరీత నష్టాల తీవ్రతను ముందుగానే ఊహించి కావచ్చు. అసహనం, భావజాలపరమైన ఆధిపత్యం, దురభిప్రాయాల కుదుళ్ల నుంచి పుట్టుకొచ్చే విద్వేష నేరాలను ఏమాత్రం సహించరాదు. విభజించు, పాలించు నినాదంతో మత, విద్వేష పాలన సాగిస్తున్న కేంద్రం విధానాల్ని ఎదుర్కోవడం ప్రస్తుతం దేశ లక్ష్యం. లౌకిక ప్రజాస్వామ్యం కోసం పోరాడుతున్న శక్తులకు మద్దతునివ్వడం, వారిబాటలో అడుగులేయడం ప్రజల కర్తవ్యం. చీకట్లోకి నెడుతున్న భారతావనికి వెలుగులు చూపడం అందరి బాధ్యత.

## నడుకూరులో గొర్లె శ్రీరాములునాయుడు వర్ధంతి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రాష్ట్ర మంత్రిగా, జెడ్పీ చైర్మన్‌గా,శాసనమండలి సభ్యునిగా, డీసీసీబీ చైర్మన్‌గా ఎన్నో పదవులు చేపట్టి ఆ పదవులకే వన్నెతెచ్చిన ప్రజానాయకుడు స్వర్గీయ గొర్లె శ్రీరాములు నాయుడని ఏయూ పాలకమండలి మాజీ సభ్యుడు ఎర్రపాత్రుని వెంకట్‌నాయుడు అన్నారు. స్వర్గీయ గొర్లె శ్రీరాములునాయుడు 20వ వర్ధంతి సందర్భంగా నడుకూరులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నీతి, నిజాయితీలకు మారుపేరుగా నిబద్ధతగల రాజకీయ నాయకునిగా ఒంటి చేతితో ఉత్తరాంధ్ర రాజకీయాలను తన కనుసన్నలో నేరపిన గొప్ప నేత శ్రీరాములునాయుడు అని కొనియాడారు. నేటి తరం నాయకులు శ్రీరాములు నాయుడుని ఆదర్శంగా తీసుకొని నీతివంతమైన సేవలు ప్రజలకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ జయశ్రీ, నాయకులు వాన త్రినాథ్ నాయుడు, సాంబనా చంద్రమౌళీశ్వరావు,కంటూ శ్రీరామ్మూర్తి. రైతు నాయకులు మంతిని పకీర నాయుడు, అలుగోలు కన్నం నాయుడు,దుర్గారావు, కింజంగి సాయిలు పాల్గొన్నారు.



# సజావుగా సాగిన జెడ్పీ బడ్జెట్ సమావేశం




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లా ప్రజా పరిషత్ అధ్యక్షురాలు పిరియా విజయ ఆధ్వర్యంలో జెడ్పీ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన 2024-25 సవరణ బడ్జెట్, 2025-26 బడ్జెట్ సజావుగా సాగింది. బడ్జెట్‌ను ప్రవేశపెట్టగా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. అలాగే జిల్లా ప్రజా పరిషత్, శ్రీకాకుళం బడ్జెట్ 2024-25 సంవత్సరం సవరణ బడ్జెట్ మొత్తం రూ.38కోట్ల,16లక్షల 92వేల 800లు రాబడిగా అంచనా వేస్తూ రూ.38,కోట్ల 1లక్ష 62వేల 800లు ఖర్చు చేయగా సంవత్సరాంతానికి మిగులు రూ.15లక్షల 3వేలు అంచనా సిద్ధం చేశారు. అదేవిధముగా 2025-26 సంవత్సరంనకు అంచనా బడ్జెట్ నందు రూ.41కోట్ల 92 లక్షల 69వేల 300లు రాబడిగా అంచనా వేస్తూ రూ.41 కోట్ల 74 లక్షల 96వేల 100లు ఖర్చు చేయగా సంవత్సరాంతానికి మిగులు రూ.17లక్షల73వేల 200లు బడ్జెట్‌గా అంచనాలు రూపొందించారు.

పి.ఐ.యు డివిజన్, పంచాయితీరాజ్, శ్రీకాకుళం యొక్క బడ్జెట్ 2024-25 సంవత్సరం సవరణ బడ్జెట్ మొత్తం రూ. 391,01,97,600లు రాబడిగా అంచనా వేస్తూ రూ.352,05,96,400లు ఖర్చును వహిస్తూ సంవత్సరాంతానికి మిగులు రూ.38,96,01,200లను అంతిమ నిలవగా అంచనా వేస్తూ పొందుపరిచారు. అదేవిధముగా 2025-26 సంవత్సరంనకు అంచనా బడ్జెట్‌లో రూ.424,31,35,000లు రాబడిగా అంచనా వేస్తూ రూ 383,04,16,500లు ఖర్చును వహిస్తూ సంవత్సరాంతానికి మిగులు రూ.41,27,18,500లను బడ్జెట్‌గా అంచనా వేస్తూ పొందుపరిచారు. పి.అర్.ఐ., పంచాయితీరాజ్, శ్రీకాకుళం బడ్జెట్ 2024-25 సంవత్సరం సవరణ బడ్జెట్ మొత్తం రూ. 91,36,12,097లు రాబడిగా అంచనా వేస్తూ రూ.90,49,62,097లు ఖర్చును వహిస్తూ సంవత్సరాంతానికి మిగులు రూ.86,50,000లను అంతిమ నిలవగా అంచనా వేస్తూ పొందుపరిచారు. అదేవిధముగా 2025-26 సంవత్సరంనకు అంచనా బడ్జెట్‌లో రూ. 112,49,15,616లు రాబడిగా అంచనా వేస్తూ రూ.112,40,65,616లు ఖర్చును వహిస్తూ సంవత్సరాంతానికి మిగులు రూ.8,50,000లను బడ్జెట్‌గా అంచనా వేస్తూ పొందుపరిచారు. పి.అర్.ఐ., పంచాయితీరాజ్, టెక్కలి యొక్క బడ్జెట్ 2024-25 సంవత్సరం సవరణ బడ్జెట్ మొత్తం రూ.43,57,50,912లు రాబడిగా అంచనా వేస్తూ రూ.42,97,01,419లు ఖర్చును వహిస్తూ సంవత్సరాంతానికి మిగులు రూ.60,49,493లను అంతిమ నిలవగా అంచనా వేస్తూ పొందుపరిచారు. అదేవిధముగా 2025-26 సంవత్సరంనకు అంచనా బడ్జెట్ నందు రూ.47,47,12,633లు రాబడిగా అంచనా వేస్తూ రూ. 45,11,86,490లు ఖర్చును వహిస్తూ సంవత్స రాంతానికి మిగులు రూ.2,35,26,143లను బడ్జెట్‌గా అంచనా వేస్తూ పొందుపరిచారు. పి.అర్.ఐ., పంచాయితీరాజ్, పాలకొండ బడ్జెట్ 2024-25 సంవత్సరం సవరణ బడ్జెట్ మొత్తం రూ.201,51,92,235లు రాబడిగా అంచనా వేస్తూ రూ.197,90,70,000లు ఖర్చును వహిస్తూ సంవత్సరాంతానికి మిగులు రూ.3,61,22,235లను అంతిమ నిలవగా అంచనా వేస్తూ పొందుపరిచారు. అదేవిధముగా 2025-26 సంవత్సరంనకు అంచనా బడ్జెట్ నందు రూ. 211,59,48,047లు రాబడిగా అంచనా వేస్తూ రూ.207,80,70,000లు ఖర్చును వహిస్తూ సంవత్సరాంతానికి మిగులు రూ.3,78,78,047లను బడ్జెట్‌గా అంచనా వేస్తూ పొందుపరిచారు.

గ్రామీణ నీటి సఫరా మరియు పారిశుద్ధ్యం, శ్రీకాకుళం బడ్జెట్ 2024-25 సంవత్సరం సవరణ బడ్జెట్ మొత్తం రూ.645,90,54,095లు రాబడిగా అంచనా వేస్తూ రూ.584,87,51,770లు ఖర్చును వహిస్తూ సంవత్సరాంతానికి మిగులు రూ.61,03,02,325లను అంతిమ నిలవగా అంచనా వేస్తూ పొందుపరిచారు. అదేవిధముగా 2025-26 సంవత్సరంనకు అంచనా బడ్జెట్‌లో రూ.742,79,27,210లు రాబడిగా అంచనా వేస్తూ రూ.672,07,94,535లు ఖర్చును వహిస్తూ సంవత్సరాంతానికి మిగులు రూ.70,71,32,675లను బడ్జెట్‌గా అంచనా వేస్తూ పొందుపరిచారు. జిల్లా ప్రజా పరిషత్, శ్రీకాకుళంతో సహా పి.ఐ.యు డివిజన్, పంచాయితీరాజ్, శ్రీకాకుళం, పి.అర్.ఐ., పంచాయితీరాజ్, శ్రీకాకుళం, పి.అర్.ఐ., పంచాయితీరాజ్, టెక్కలి, పి.అర్.ఐ., పంచాయితీరాజ్, పాలకొండ మరియు గ్రామీణ నీటి సఫరా, పారిశుద్ధ్యం, శ్రీకాకుళం వారి బడ్జెట్‌లు క్రోడికరించి మొత్తం అన్ని పద్దుల క్రింద 2024-25 సంవత్సరం సవరణ బడ్జెట్ మొత్తం రూ.1411,54,99,739లు రాబడిగా అంచనా వేస్తూ రూ.1306,32,44,486లు ఖర్చును వహిస్తూ సంవత్సరాంతానికి మిగులు రూ.105,22,55,253లను అంతిమ నిలవగా అంచనా వేస్తూ పొందుపరిచారు. అదేవిధముగా 2025-26 సంవత్సరంనకు అంచనా బడ్జెట్ నందు రూ.1580,59,07,806లు రాబడిగా అంచనా వేస్తూ రూ.1462,20,29,241లు ఖర్చును వహిస్తూ సంవత్సరాంతానికి మిగులు రూ.118,38,78,565లను బడ్జెట్‌గా అంచనా వేస్తూ పొందుపరిచారు.

కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ఎల్ఎన్‌వీ శ్రీధర్ రాజా, డిప్యూటీ సీఈఓ డి.సత్యనారాయణ, పి.ఐ.యు.డివిజన్, పి.అర్.ఐ., పంచాయితీరాజ్, శ్రీకాకుళం సీఈఓ ఎస్.రామకృష్ణ, పి.అర్.ఐ., పంచాయితీరాజ్, టెక్కలి, పాలకొండ సీఈఓలు, జెడ్పీ ఉపాధ్యక్షురాలు పాలిన శ్రావణి, జెడ్పీటీ సీలు, ఎంపీపీలు, కో-ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.



# సమస్య వస్తే కుంగిపోలేదు..

# నిలబడి గెలిచింది!!

ఆమె మనసులో ఏముంది.. ఆమెలో ఎందుకంత చింత? మా చుట్టాల్లో కొందరితో సహా బయట కొంతమం దిని చూశాను. మగవాళ్లకు పాతికేళ్లు వస్తాయి. పెద్దగా చదువుండదు. బోలెడంత లోకజ్ఞానం ఉందన్న భ్రమ మాత్రం ఉంటుంది. పెద్దగా చదువు లేని, అమాయకురాలైన ఆడపిల్లను ఉదారంగా కట్నం తీసుకుని పెళ్లి చేసుకుంటారు. వీడికి పాతికైతే, ఆ పిల్లకు పదహారో, పదిహేడో! ఏడాదిలో మొదటి బిడ్డ, ఆపై రెండేళ్లకు ఇంకో బిడ్డ. ఇద్దరూ ఆడపిల్లలే అయితే మూడో బిడ్డకు కూడా రెడీ అవ్వాల్సిందే! వాడికి పోయేదేముంది, కనాల్సింది ఆ అమ్మాయి కదా! భర్త, బిడ్డలు, ఇంటి పనులతో సతమతమవుతూ ఆ అమ్మాయి పోషకాహారలోపానికి బ్రాండ్‌లా మారిపోతుంది. గాలొస్తే పడిపోయేంత బలహీనంగా తయారవుతుంది. మొగుడికి సేవలు, పిల్లల పోషణ కామన్. 'అపురూపమైదమ్మ ఆడజన్మ.. ఆ జన్మకు పరిపూర్ణత ఇల్లాలమ్మా' అనే బ్యాక్‌గ్రౌండ్ సాంగ్ కూడా కామన్.

ఇదంతా కొద్దోగొప్పో బాధ్యతలు ఎరిగిన భర్త ఉంటేనే! బాధ్యతలు పట్టని భర్త ఉంటే భార్య పరిస్థితి ఇంకా దారుణంగా ఉంటుంది. వీధంతా అప్పులు, ఊరందరి దగ్గరా చేబదుళ్లు. ఏ క్షణాన ఏ సమస్య వస్తుందో తెలియని భయం. ఏ అప్పులవాడు ఏ మాటంటాడోనని వణుకు. అనుభవిస్తే తప్ప అర్థం కాని నరకం అది.

దాని గురించి పాతికేళ్ల క్రితమే 1998లో మలయాళంలో సినిమా తీశారు. పేరు 'చింతావిష్టయాయ శ్యామల'. అంటే 'చింతాక్రాంతురాలైన శ్యామల' అని అనువదించుకోవచ్చు. 'చింతలో మునిగిపోయిన శ్యామల' అని కూడా అనుకోవచ్చు.

దేశంలో అనేక కుటుంబాల్లో నెలకొన్న సంకట స్థితికి ఈ సినిమా తెరరూపం. ఉద్యోగం చేయక, మరేదో గొప్పగా సాధించాలని, కోట్లు గడించాలని చూసే భర్త. ఉన్నదాంట్లో కుటుంబం గడిస్తే చాలని భావిస్తూ, సర్దుకుపోతూ బతికే భార్య శ్యామల. వారికి ఇద్దరు ఆడపిల్లలు. భర్త ప్రయత్నాలన్నీ బెడిసికొడుతున్నాయని తెలిసినా, ఏమీ అనక, అతనికి అన్ని వేళలా అన్నీ అమర్చే భార్య శ్యామల.

ఒకవైపు అప్పులు పెరుగుతున్నాయి. మరోవైపు పిల్లలు ఎదుగుతున్నారు. సంసారం ఎటుపోతుందో తెలియడం లేదు. భర్తను నిలదీసింది. తమ భవిష్యత్తుకు దారి చూపమని అడిగింది. అంతే.. చెప్పాపెట్టకుండా ఇల్లు వదిలి వెళ్లిపోయాడు భర్త.

శ్యామల భయపడలేదు. కూర్చొని బోరుమని ఏడవలేదు. నిలదొక్కుకుంది. చేతికందిన పని చేసింది. విజయం సాధించింది. పిల్లల్ని బాగా చూసుకుంది. సొంత కాళ్ల మీద నిలబడింది. రకరకాల చోట్లు తిరిగిన భర్తకు చిట్టచివరికి జ్ఞానోదయం అయ్యింది. తన ఆశలన్నీ గాలిమేడలని, కష్టపడకుండా ఏదీ రాదని తెలిసింది. భార్యాబిడ్డల్ని వెతుక్కుంటూ వచ్చాడు. క్షమించమన్నాడు. చివరికి అంతా ఒక్కటయ్యారు.

ఈ సినిమాకు స్ఫూర్తి ఏమిటి? 'చింతావిష్టయాయ సీత' అనే పేరుతో మలయాళ కవి, సంఘసంస్కర్త కుమరన్ ఆసన్ (1871-1924) రాసిన ఓ కవిత్వ సంపుటి. గర్భవతినైన తనను అడవిలో వదిలేసినప్పుడు, ఒంటరి తల్లిగా పిల్లల్ని పెంచుతున్నప్పుడు తానెంత వేదన అనుభవించానో సీత మననం చేసుకుంటున్నట్లుగా సాగే కవిత్వం అది.

ఎప్పుడది రాసింది? 1919లో. ఎంత విమర్శ వచ్చి ఉంటుంది! ఎంత వివాదం రేగి ఉంటుంది! కానీ ఆ విమర్శలు, వివాదాలు మిగిలాయా? రాసిన రాత కదా మిగిలింది. తిరువనంతపురంలోకి కేరళ యూనివర్సిటీ ఎదుట ఆసన్ విగ్రహం ఏర్పాటు చేశారు. జోహార్ కుమరన్ ఆసన్!

మలయాళ నటుడు శ్రీనివాసన్ తనే నటించి, దర్శకత్వం వహించిన రెండో సినిమా ఇది. కేరళలో నేటికీ ఈ సినిమాకు ప్రత్యేకమైన అభిమానగణం ఉంది. మలయాళంలో Women Entrepreneurship అంశంతో వచ్చిన సినిమాల్లో ఇదీ ఒకటి.

శ్యామలగా సంగీత ('సమరసింహారెడ్డి' సినిమాలో బాలకృష్ణ పెద్ద చెల్లెలు పాత్ర చేసిన నటి) అద్భుతంగా నటించి, ఆ తర్వాత కాలంలో ఆ పేరుతోనే అందరికీ గుర్తుండిపోయారు. ఆమె భర్త విజయన్‌గా శ్రీనివాసన్ నటించారు.

సినిమాగా ఈ కథ కొంతవరకు తెలుగులో వచ్చిన 'శుభోదయం' సినిమాను పోలి ఉంటుంది. అయితే అంశాలుగా రెండూ వేర్వేరు అనిపిస్తాయి. 'చింతావిష్టయాయ శ్యామల'ను ఆ తర్వాత తెలుగులో కోడి రామకృష్ణ దర్శకత్వంలో 'ఆవిడే శ్యామల'గా రీమేక్ చేశారు.

శ్యామలగా రమ్యకృష్ణ, ఆమె భర్తగా ప్రకాశ్‌రాజ్ పోటాపోటీగా నటించారు. కానీ మూలంలో ఉన్న సోల్ ఆ సినిమాలో కనిపించకపోవడంతో పెద్దగా ఆడలేదు. అయితే చూసేందుకు బాగుంటుంది.

(- విశీ (వి.సాయివంశీ)..

## గేమ్ ఛేంజర్.. పెద్ద స్కెచ్చే ఇది..!




గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ శంకర్ కాంబోలో భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన సినిమా గేమ్ ఛేంజర్. 20 ఏళ్ల కెరీర్ లో దిల్ రాజు నిర్మించిన హైయ్యెస్ట్ బడ్జెట్ సినిమా ఇది. శంకర్ మార్క్ గ్రాండియర్‌తో పాటు ఆయన ఒకప్పటి సినిమాల్లో ఉండే సోషల్ మెసేజ్ కూడా ఈ సినిమాలో ఉందని తెలుస్తుంది. సంక్రాంతి కానుకగా రాబోతున్న రామ్‌చరణ్ గేమ్ ఛేంజర్ సినిమా రాబోతున్న రెండు సినిమాలకు గట్టి పోటీ ఇవ్వనుంది. నేషనల్ వైడ్ గానే కాదు యూఎస్‌లో కూడా ఈ సినిమా కోసం మెగా ఫ్యాన్స్ ఎంతో ఎగ్జైటెడ్‌గా ఉన్నారు. ఐతే స్టార్‌సినిమా రిలీజ్ ముందు ఉండాల్సిన హంగామా హడావిడి గేమ్ ఛేంజర్ కి కనిపించట్లేదు. ఈమధ్య ప్రెస్ మీట్ లో దిల్ రాజు కూడా ఈ విషయాన్ని ప్రస్తావించారు. మేము చేసేది చేస్తున్నామని అన్నారు. ఐతే గేమ్ ఛేంజర్ సినిమాను ఇంతలో ప్రొఫైల్ ప్రమోషన్స్ చేయడానికి బలమైన రీజన్ ఉందని తెలుస్తుంది. సినిమా మీద భారీగా అంచనాలు పెంచి ఒకవేళ ఆ అంచనాలను అందుకోకపోతే సినిమాకు డిజాస్టర్ టాక్ వస్తుంది. అందుకే గేంఛేంజర్ సినిమాను చాలా తక్కువ ప్రమోషన్స్ చేస్తున్నారట. ఇదంతా మేకర్స్ వేసిన పెద్ద స్కెచ్‌లో భాగమే అని తెలుస్తుంది. గేమ్‌ఛేంజర్ సినిమాలో చాలా హైలెట్స్ ఉన్నాయట. ముఖ్యంగా ఇంటర్వెల్ బ్లాక్ అదిరిపోతుందని అంటున్నారు. ఇంటర్వెల్ సీన్ ఆ యాక్షన్ సీక్వెన్స్ ఆడియన్స్‌కు గూస్ బంప్స్ తెప్పిస్తుందని అంటున్నారు. మరోపక్క ప్రీ క్లైమాక్స్ కూడా సినిమాకు బలమని తెలుస్తుంది. పొలిటికల్ ట్విస్ట్ తో గేమ్ ఛేంజర్ లో ఆ సీన్స్ కూడా మేజర్ హైలెట్ అవుతాయని తెలుస్తుంది. వీటితో పాటు సినిమాలో ప్రతి సాంగ్ కోట్లు ఖర్చు పెట్టి తీశారు కాబట్టి అది కూడా బాగా వర్క్ అవుట్ అయ్యేలా ఉన్నాయని అనిపిస్తుంది. గేమ్ ఛేంజర్ సినిమా విషయంలో మెగా ఫ్యాన్స్‌ని కచ్చితంగా సర్‌ప్రైజ్ చేస్తారని అంటున్నారు. రాం చరణ్ గేమ్ ఛేంజర్ సినిమాలో కియరా గ్లామర్, థమన్ మ్యూజిక్, హీరో విలన్ సీన్స్ ఇక చరణ్ డ్యుయల్ రోల్ పర్ఫార్మెన్స్ ఇవన్నీ హైలెట్స్‌గా చెప్పుకుంటున్నారు. అంతేకాదు మాస్టర్ క్లాస్ డైరెక్టర్ శంకర్‌ని అసలు తక్కువ అంచనా వేయలేం. సో గేమ్ ఛేంజర్ బజ్ కాస్త తక్కువగానే ఉన్నా రిలీజ్ తర్వాత సినిమా రేంజ్ ఏంటన్నది తెలుస్తుందని అంటున్నారు. - తుపాకి.కామ్ సౌజన్యంతో...




మాఫియా డాన్ దావూద్‌నే గజగజలాడించింది! ఉన్నత కుటుంబానికి చెందిన ఓ గృహిణి.. డాన్‌గా ఎందుకు మారింది..? అండర్ వరల్డ్ డాన్‌గా దావూద్ ఇబ్రహీం నెట్ వర్క్ ప్రపంచదేశాల అండరవరల్డ్ మాఫియాతో తన సంబంధాలు.. ఈలోకానికి ఎంతో కొంత తెలిసిందే. బాలీవుడ్ ను శాసించిన మాఫియా డాన్ గా దావూద్ పేరు తెలియనివారూ అరుదే! అలాంటి దావూద్ ను అంతం చేస్తానని హెచ్చరించిన ఓ లేడీ డాన్ గురించి మీరు విన్నారా..?

# దావూద్‌నే గడగడలాడించింది!

ఒక గౌరవప్రదమైన కుటుంబంలో జన్మించి, గృహిణిగా ఉండే ఓ మహిళ.. తన భర్త హత్య తర్వాత దావూద్ ఇబ్రహీంను మట్టుబెడతానని శపథం పూనింది. ముంబై అండర్ వరల్డ్ డాన్ గా దావూద్ ఇబ్రహీం పేరుకెక్కితే ఆ దావూద్ ఇబ్రహీంకే వ్యతిరేకంగా ముఠాలను జట్టు కట్టి దావూద్ కార్యకలాపాలను ఎక్కడికక్కడ అడ్డుకుంటూ దావూద్ అండ్ కంపెనీకి నిద్ర లేని రాత్రులు మిగిల్చింది.

### ఇంతకీ ఎవరామె..?

1993 బాంబు పేలుళ్లకు సూత్రధారిగా, ప్రపంచ ఉగ్రవాదులతో సంబంధాల నేపథ్యంలో టెర్రరిస్ట్ కార్యకలాపాలకు కేరాఫ్‌గా మారిన దావూద్ ఇబ్రహీం కోసం ముంబై పోలీస్, భారత నిఘా సంస్థలు శోధించని చోటు లేదు. 2003లో ఏకంగా 25 మిలియన్ డాలర్ల ప్రైజ్ మనీని అతడి తలకు వెలకట్టి ప్రకటించిన ప్రపంచ ఉగ్రవాది దావూద్. ముంబైడాన్‌గా వెలుగులొకొచ్చిన ఆ చీకటి సామ్రాజ్యపు అధినేత దావూద్ ఇబ్రహీం చేతుల్లో మొహమ్మద్‌ఖాన్ అనే వ్యక్తి దారుణహత్యకు గురయ్యాడు. ఎందరో గ్యాంగ్‌స్టర్ దావూద్ రౌడీగ్యాంగ్స్ చేతుల్లో హతమైనా మెహమూద్ ఖాన్ హత్య మాత్రం దావూద్ ను వెంటాడింది. ఒక మాటలో చెప్పాలంటే ప్రపంచ నిఘా సంస్థల కళ్లుగప్పి మేనేజ్ చేయగల్గిన అంతటి గ్యాంగ్‌స్టర్.. ఒక మహిళ ఆది పరాశక్తిగా మారి శపథం పూని వెంటాడితే తన నేర జీవితమెంత సవాళ్లనెదుర్కోవాల్సి వస్తుందో రుచిచూశాడు.

ఈ విషయాన్ని ముంబైకి చెందిన జర్నలిస్ట్ హుస్సేన్ జైదీ మాఫియా క్వీన్స్ ఆఫ్ ముంబై అనే పుస్తకంలో పేర్కొన్నాడు. తన పుస్తకంలో ఆమెను ఫెమ్మా ఫాటెల్ అంటే పగ తీర్చుకునేందుకు సిద్ధమైన ఓ దేవదూతగా అభివర్ణించాడు. హుస్సేన్ మాఫియా కథలపై రాసిన డోంగ్రీ టూ దుబాయ్, సిక్స్ డికేడ్స్ ఆఫ్ ముంబై మాఫియా, మాఫియా క్వీన్స్ ఆఫ్ ముంబై, బ్లాక్ ఫ్రైడే, మైనేమ్ ఈజ్ అబూసలేమ్, బైకుల్లా టూ బ్యాంకాక్ వంటివెన్నో హాట్ కేకుల్లా అమ్ముడుపోయాయి. ఇక కొన్ని రచనలాధారంగా ఏకంగా బాలీవుడ్ సినిమాలు కూడా నిర్మించారు. నిన్నమొన్నటి సంజయ్ లీలా భన్సాలీ నిర్మించిన సినిమా గంగూభాయి కటియావాడీకి కూడా జైదీ రాసిన మాఫియా క్వీన్స్ ఆఫ్ ముంబై రచనే మూలం.

ముంబైలోని ఓ సంప్రదాయ ముస్లిం కుటుంబంలో జన్మించిన సప్నకు.. తన భర్త మెహమూద్‌కు ముంబై అండర్ వరల్డ్‌తో ఉన్న లింక్స్ గురించి తెలియదు. దావూద్ చెప్పినవాటిని పెడచెవిన పెట్టినందుకు మొహమూద్‌ను దావూద్ మనుషులు ముంబై విమానాశ్రయంలో అతి కిరాతకంగా హత్య చేశారు. కలచివేసిన తన భర్త మరణంతో అప్పటివరకూ ఓ సాధారణ గృహిణిగా ఉన్న సప్న దావూద్ ఇబ్రహీంను మట్టుబెడతానని ప్రతినబూనింది. వినడానికి సినిమాటిక్, డ్రమటిక్‌గా అనిపించినా ఆమెలో రగిలిన పగ ఆమెను మరో మాఫియా క్వీన్‌గా మార్చేసింది.

దావూద్‌ను మర్డర్ చేసేందుకు ఓ ప్రణాళిక రచించే క్రమంలో ముందుగా ఆయుధాలనెలా వాడాలో నేర్చుకుంది అష్రాఫ్ ఉరఫ్ సప్నాదీదీ. దావూద్ ప్రత్యర్థి గ్యాంగులతో జట్టు కట్టడంతో పాటు.. ఓ కీలక గ్యాంగ్ స్టర్ గా ముంబై అండర్ వరల్డ్ సామ్రాజ్యంలో పేరు మోసిన హుస్సేన్ ఉస్తారాను కలిసింది. ఆయనతో మచ్చిక చేసుకుని తన నుంచే ఆయుధాలనెలా వాడాలో తెలుసుకుంది. అలా మెల్లిమెల్లిగా దావూద్ అంటే పడని గ్యాంగ్స్ తో చేతులు కలిపిన సప్న.. కాస్త పుంజుకుంటూ తన ఆధిపత్యాన్ని మొదలుపెట్టింది. దావూద్‌కు పోర్టుల ద్వారా వచ్చే స్మగుల్డ్ గూడ్స్, ఆయుధాలను ఎక్కడికక్కడ అడ్డుకోవడంతో చాలాకాలం దావూద్ గ్రూప్ ఇరిటేటైంది. వారి కార్యకలాపాలకూ తీవ్ర అంతరాయమేర్పడింది. కానీ, సప్నను మాత్రం వారు పట్టుకోలేకపోయారు. ఎక్కడుందో కనుక్కోలేకపోయారు. మెహమూద్ ను మర్డర్‌ను చేసినదానికి ఇంతవరకూ వస్తుందనుకోలేదనే పశ్చాత్తాపమూ తప్పలేదు. సప్న అప్పటికే ముంబై అండర్ వరల్డ్ గురించి అణువణువూ తెలుసుకుంటోంది. ఆమె ఎంతగా విస్తరిస్తుంటే అంతగా దావూద్ అండ్ కంపెనీ అనుచరుల్లో తెలియని ఆందోళన, భయం రోజురోజుకూ పెరుగుతోంది. అప్పటికే ముంబై నగరంలోని పలు పేకాట క్లబ్బులు, డ్యాన్స్ బార్స్ పైనా సప్నాదీది పెత్తనం మొదలైంది. దావూద్ గ్యాంగులను ఆయా చీకటి వ్యాపారసామ్రాజ్యం పట్టించుకోవడం మానేస్తోంది. ఇవన్నీ దావూద్ కూ, ఆయన గ్యాంగ్‌కు ఏమాత్రం మింగుడుపడని పరిస్థితులను సృష్టించాయి.

### దావూద్ మర్డర్‌కు సప్న వేసిన ప్లానేంటి..?

అది 1990వ సంవత్సరం. భారత్ – పాక్ క్రికెట్ మ్యాచంటే నరాలు తెగే ఉత్కంఠ ఉన్న రోజులవి. ఏకంగా బాలీవుడ్ నే కాదు.. క్రికెటర్స్‌తోనూ సంబంధాలతో దావూద్ ఇబ్రహీం నేతృత్వంలోని అండర్ వరల్డ్ మాఫియా తామాడిందాట అన్నట్టుగా సాగుతున్న కాలమది. అదిగో అప్పుడు ఇండియా–పాక్ మ్యాచ్ జరుగుతున్న షార్జాలో దావూద్ ఇబ్రహీంను లేపెయ్యాలని చూసింది సప్న. అందుకోసం తన రౌడీమూకనంతా అందుకు తగ్గట్టుగా తయారుచేసి షార్జాకు పంపింది.

ఆమెకు తెలుసు షార్జాలో దావూద్ ను చంపడమంటే అత్యంత సాహసోపేతమైన నిర్ణయమని. కానీ, అప్పుడు కాకుంటే ఇంకెప్పుడూ కాదనేది డిసైడైంది. అప్పటికే నిరీక్షణకు ఓపిక నశించింది. వీఐపీ గ్యాలరీలో కూర్చుని చూసే దావూద్‌పైన దాడి చేసేందుకు ఒక ప్రణాళికను సిద్ధం చేసింది. ప్రేక్షకులుగా తన రౌడీమూకను పెద్దఎత్తున ఛత్రీలు, సీసాలతో స్టేడియంకు పంపి వాటిని విసిరి ఒక రభస సృష్టించి.. ఆ గొడవలోనే దావూద్ ను మర్డర్ చేయాలనే ప్లాన్ గీసింది. గ్యాంగులో కొందరు దావూద్ అనుచరులపై ఫోకస్ చేస్తే.. మరికొందరు కేవలం దావూదే టార్గెట్ గా దాడి చేయాలనేది ప్లాన్.

### కానీ, బెడిసికొట్టిన హత్యా పథకం!

ఇండియా–పాక్ మ్యాచ్ అంటేనే లొల్లి. అలాంటిచోట ఒకవేళ గనుక షార్జాలో సప్న వేసిన ఎత్తుగడే ఫలించి ఉంటే.. గెల్చిన జట్టు వేడుక చేసుకోవాల్సిన వేదిక కాస్తా అల్లకల్లోలంగా మారి ఉండేదేమో! కానీ, ఎవరు లీక్ ఇచ్చారో తెలీదు. సప్నాదీది ప్లాన్ మొత్తం బట్టబయలైంది. దాంతో విషయాన్ని ముందే పసిగట్టిన దావూద్ అండ్ గ్యాంగ్ తప్పించుకుంది. ఇక సప్నాదీదిని మట్టుబెట్టడమే లక్ష్యంగా దావూద్ డీ కంపెనీ పనిచేసింది.

షార్జా కప్ జరిగిన నాల్గేళ్ల తర్వాత అంటే 1994లో ఒకరోజు దావూద్ గూండాలు ముంబైలో సప్నను వెంటాడారు. వేటాడి కత్తులతో 22 సార్లు పొడిచి అతి కిరాతకంగా నరికి చంపేశారు. ఆమె సాయం కోసం ఏడుస్తూ ఇరుగుపొరుగువారిని అడుక్కున్నా లాభం లేకపోయింది. అప్పటివరకూ సినిమాల్లో మాత్రమే కనిపించే ఆ సీన్ ముంబైలో ఒక భీతావహ దృశ్యాన్ని జనం కళ్లముందుంచింది. ఆ తర్వాత ఆమెను ఆసుపత్రికి తీసుకెళ్లేలోపే సప్నాదీది కన్నుమూసింది. భారతదేశాన్నే వణికించి హాట్ టాపిక్ గా మారిన ఓ అండర్ వరల్డ్ డాన్ ను.. ఓ మహిళ గడగడలాడించిన ఈ చరిత్రను విశాల్ భరద్వాజ్ దీపికా పడుకునెతో సినిమాగా తెరకెక్కించాలని ప్లాన్ చేశారు. కానీ, ఎందుకో ఆ సినిమా వాయిదాలు పడుతూ వచ్చిందేగానీ, పూర్తి కాలేదు. – బాతాఖానీ.కామ్ సౌజన్యంతో...

## మకుటం లేని మహారాజు శ్రీరాములునాయుడు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రాజకీయాల్లో మకుటం లేని మహారాజుగా మెలిగిన స్వర్గీయ గొర్లె శ్రీరాములు నాయుడు నిలిచారని శ్రీకాకుళం జిల్లా తూర్పుకాపు సంక్షేమ సంఘం ప్రతినిధులు సురంగి మోహనరావు పేర్కొన్నారు. శ్రీరాములునాయుడు 20వ వర్ధంతి నగరంలో జిల్లా తూర్పు కాపుసంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మోహనరావు మాట్లాడుతూ మూడున్నరదశాబ్దాల రాజకీయ జీవితంలో నీతి, నిజాయితీ, నిబద్ధతతో పనిచేసి అందరి అభిమానాన్ని పొందిన ఏకైక నాయకునిగా శ్రీరాములు నాయుడు పేరుగాంచారన్నారు. శాసపు జోగినాయుడు, డాక్టర్ ఎం.రామ జోగినాయుడు, కిల్లారి నారాయణరావు, వాళ్ళ శ్రీరాములు నాయుడులు మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లా సర్వతోముఖాభివృద్ధికి పాటుపడే మొదటి తరం నేతల్లో శ్రీరాములు నాయుడు అగ్రగణ్యులు అని కొనియాడారు. మాజీమంత్రిగా, జెడ్పీచైర్మన్‌గా పదవులు నిర్వహించి ఎంతోమంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించారన్నారు. విద్యాభివృద్ధికి, సాగునీటి రంగం అభివృద్ధికి బాటలు వేశారన్నారు. జాతి ఆణిముత్యంగా కీర్తించబడే శ్రీరాములు నాయుడు కాంస్య విగ్రహాన్ని త్వరలో కుటుంబసభ్యుల సౌజన్యంతో శ్రీకాకుళం నగరంలో ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తూర్పుకాపులకు బీసీ–డిలో చేర్చి జాతిని అన్ని రకాలుగా ఉద్ధరించి, రాష్ట్రంలో తగిన గుర్తింపు గౌరవం తెచ్చిన మహోన్నత వ్యక్తిత్వం కలిగిన నేత స్వర్గీయ గొర్లె శ్రీరాములు నాయుడు అని ప్రశంసించారు. అనంతరం ఏడురోడ్ల కూడలి వద్ద, కిమ్స్ హాస్పిటల్‌రోడ్‌లో గల శ్రీరాములునాయుడు విగ్రహం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ యువనేత అంధవరపు ప్రసాద్, శ్రీరాములునాయుడు కుటుంబసభ్యులు కనుగుల దుర్గా శ్రీనివాస్, కురిటి రామకోటేశ్వరరావు, సామాజిక సేవకులు బీవీ రవిశంకర్, తూర్పుకాపు సామాజిక వర్గం ప్రతినిధులు లంక గాంధీ, కెళ్ల చిన్న కృష్ణ, డోల బాలకృష్ణ, అంపోలు లక్ష్మణరావు, మిర్తివాడ ప్రభాకర్, అంకడాల తవిటన్న, కొమ్ము రమణమూర్తి, వాన కృష్ణచంద్, వావిలపల్లి జగన్నాథనాయుడులు పాల్గొన్నారు.





నడుము కింద భాగం చచ్చుబడిపోతే నేమి, మూడు శస్త్ర చికిత్సలు183 కుట్లు పడితేనేమి, వీల్ చైర్ కే పరిమితం ఐతే నేమి, 45ఏళ్ల వయస్సు ఉంటేనేమి పక్ష వాతం ఐతేనేమి వాటన్నిటికి సమాధానం తన వజ్ర సంకల్పం గెలిచే వరకు వదల్లే దు ఆఖరికి పారాలింపిక్స్‌లో షాట్ పుట్ లో రజతం గెలిచింది ఇంక ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తుంది తానే దీపా మాలిక్. తన జీవితం గురించి మనకు తెలియని విషయాలు..

# వైకల్యాన్ని ఎదురించి.. స్ఫూర్తినిస్తోంది!

మన భారత్ కు మరో పతకం అందించిన దీప ఆర్మీ కుటుంబం నుంచి వచ్చిన ఆమె ధైర్య సాహసాలకు పెట్టింది పేరు. దీప వెన్నుముక్కలో కణతి ఉన్నట్లు 1999 లో వైద్యులు తేల్చారు. శస్త్ర చికిత్స కారణంగా ఆమె ఎంతో బలహీనపడింది. తానిక నడవలేనని తెలిసిన అధైర్యపడలేదు. కార్గిల్ యుద్ధంలో పాల్గొని విజయవంతంగా తిరిగొచ్చిన భర్త కల్నల్ బిక్రమ్ సింగ్ నే ఆమె స్ఫూర్తిగా తీసుకుంది. 14 ఏళ్లు నరకం అనుభవించిన ఆమె జీవితంలో పోరాడాలని నిర్ణయించుకుంది. బైక్ రైడింగ్ అంటే ఇష్టపడే దీప. నడవలేని స్థితిలోను భిన్నమైన క్రీడల్లో ప్రవేశించాలని సంకల్పించుకుంది. 36 ఏళ్ల వయస్సులో ఆమె స్విమ్మింగ్, రేసింగ్,అథ్లెటిక్స్ లాంటి క్రీడల్లో రాణించేందుకు ప్రయత్నించింది. హిమాలయ మోటర్ స్పోర్ట్స్ సంఘంలో చేరి సాహస క్రీడల్లో శిక్షణ పొందింది. హిమాలయాల్లో వణకించే వాతావరణంలో బైక్ పై 1700 కి.మీ దూరాన్ని ఎనిమిది రోజుల్లో పూర్తి చేసి ఆశ్చర్యపరిచింది దీప.

బైక్ రైడింగ్‌కు వీలుగా భుజాలు బలంగా తయారు కావడానికి ఆమె స్విమ్మింగ్ కూడా నేర్చుకుంది బైక్ రైడింగ్ లో నాలుగు లిమ్కా బుక్ ఆఫ్ రికార్డులు దీప పేరిట ఉన్నాయి.

అంతే కాదు స్విమింగ్ లోనూ ఆమె ఎన్నో రికార్డులను సొంతం చేసుకుంది. స్విమ్మింగ్ లో 13 అంతర్జాతీయ పతకాలు సాధించింది. దీప ప్రయాణం ఇక్కడితో ఆగిపోలేదు. దీప ఆల్ రౌండర్ ఏదో ఒక ఆటకే పరిమితం కాలేదు. బైక్ రైడింగ్ పక్కన పెట్టి జావెలిన్ త్రో, షాట్ పుట్‌ల పై దృష్టి సారించింది ఈ క్రీడల్లోనూ జాతీయ రికార్డులు ఆమె పేరిట ఉన్నాయి. 2012 లండన్ పారాలింపిక్స్ లోనే ఆమె పోటీ పడాల్సి ఉంది. అప్పుడు పరిమిత బెర్తులే ఉండటంతో ఆమెకు అవకాశం లేకుండా పోయింది.

ఐతే ఈ సారి మాత్రం దీప వదల్లేదు. రియో పారాలిపిక్స్ కు అర్హత సాధించి చరిత్ర సృష్టించింది. 2012లో అర్జున అవార్డు సాధించిన ఈ హరియాణ ధీర..గో స్పోర్ట్స్ అకాడమీ సహకారంతో పారాలింపిక్స్ లో సత్తా చాటింది. ఇద్దరు అమ్మాయిల తల్లి అయిన దీప రిటైర్ అయ్యే వయస్సులో దేశం గర్వించే ఘనత సాధించింది.



ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పిలుపుమేరకు ప్రధాని నరేంద్ర మోదీ భారీ బహిరంగసభకు శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ఆధ్వర్యంలో నగరానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివెళ్లారు. – సత్యంన్యూస్, శ్రీకాకుళం

స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ ఆదేశాలు మేరకు బుధవారం విశాఖపట్నంలో జరుగుతున్న ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ భారీ సభకు టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు పి ఎం జె బాబు, ఐటీడీపీ జిల్లా అధ్యక్షుడు ప్రధాన విజయరాం తదితరులు బయలుదేరారు.
– సత్యంన్యూస్, శ్రీకాకుళం



## కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా కణితి నవీన్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా శ్రీకాకుళం జిల్లా నందిగాం మండలం హరిదాసుపురం గ్రామానికి చెందిన కణితి నవీన్ చైర్మన్‌గా నియమితులయ్యారు. ఏపీ అర్ అండ్ బీ శాఖలోని జాయింట్ స్టేట్ ఆర్కిటెక్ట్‌గా ఉన్న నవీన్ గతంలో నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ క్రమశిక్షణ కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు, ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం చైర్మెన్‌గా నియమించింది. ఈ కమిటీలో ముగ్గురు సభ్యులు ఉంటే అందులో ఒకరిని ఎన్నుకుంటారు. మిగిలిన ఇద్దరిని కేంద్రం నామినేట్ చేస్తుంది. పుష్కర్ మురళీధర్ కన్విండే (మహారాష్ట్ర) అజయ్ కేశవ్ (చండీఘర్) అనే సభ్యులను కేంద్రం నామినేట్ చేసింది. ఈ కమిటీ దేశవ్యాప్తంగా మౌలిక వసతుల విషయంలో నిబంధనలు పాటించని , తప్పులు చేసిన అర్కిటెక్ట్స్‌లపై ఈ క్రమశిక్షణ కమిటీ విచారించి అర్కిటెక్ట్స్ యాక్ట్ 1972 ప్రకారం చర్యలు తీసుకుంటుంది. ఈ కమిటీ లో మొదటి సారి రాష్ట్ర అధికారికి అవకాశం కలిగింది. అదికూడా శ్రీకాకుళం జిల్లా వ్యక్తికి ఈ అవకాశం రావడంతో జిల్లా వాసులు ఆనందం వ్యక్తం చేస్తూ, పలువురు జిల్లా ప్రముఖులు నవీన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పని చేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను.
CONTACT:
9440001447, 8341163666

భాస్కర టూర్స్ & ట్రావెల్స్
ఆన్‌లైన్ వర్క్స్
ఇ-రిజర్వేషన్, బస్ టిక్కెట్స్, వాల్వో ఎ/సి, నాన్ ఎ/సి, రైల్వే, ఫ్లైట్ టిక్కెట్స్ మొదలైనవి చేయబడును.
ఆర్ట్స్ కాలేజ్ రోడ్, అంబేద్కర్ జంక్షన్ దగ్గర, శ్రీకాకుళం.
సెల్: 77320 63656, 80967 20076
btsrikakulam@gmail.com

ఎం.ఇర్షాద్
USHA ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

మెట్రో సోఫా వర్క్స్
అన్ని రకముల సోఫాలు, ఫర్నిచర్ మేనుఫేక్చర్స్ (హోల్‌సేల్ & రిటైల్)
షాపు నెంబరు 1, కొన్నవీధి, వన్‌వే ట్రాఫిక్ రోడ్డు, మాధవ మోటార్స్ దరి, శ్రీకాకుళం
సెల్: 83094 81129

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
Near Surya Mahal Theatre
Women's College Road,
Srikakulam - 532 001

# సారీ ఠాకూర్‌జీ... మేము రాం!





- నిరసన కార్యక్రమానికి నిరసన సెగ
- షర్మిల నిర్ణయాలపై జిల్లా కాంగ్రెస్ నేతల అలక
- కాంగ్రెస్ పెద్దలు పట్టించుకోపోవడమే కారణం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి మాణిక్యం ఠాకూర్, సిడబ్ల్యుసి సభ్యుడు గిడుగు రుద్రరాజు, రాష్ట్ర కాంగ్రెస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు షేక్ మస్తాన్ వలీ స్వయంగా ఉత్తరాంధ్రకు వస్తున్నా స్థానిక కాంగ్రెస్ నాయకులు ఈ కార్యక్రమాన్ని బాయ్‌కాట్ చేస్తున్నారు. పీసీసీ అధ్యక్షురాలు షర్మిల వ్యవహార శైలికి నిరసనగా తమకు నాయకులు కావాలి గాని, సెలబ్రిటీలు వద్దనే సంకేతాన్ని కాంగ్రెస్ అధిష్టానానికి పంపడానికి సిద్ధమవుతున్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలకు నిరసన తెలిపే కార్యక్రమం చేపట్టడానికి కాంగ్రెస్ పెద్దలు ఉమ్మడి ఉత్తరాంధ్రలో గురు, శుక్రవారాల్లో నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చారు. ఇందులో భాగంగానే శ్రీకాకుళం నగరంలో అంబేద్కర్ జంక్షన్ వద్ద గురువారం నిరసన కార్యక్రమం చేపడుతున్నామని, దీనికి జిల్లాలో కాంగ్రెస్ ఇన్‌ఛార్జిలందరూ హాజరుకావాలని రాష్ట్ర కాంగ్రెస్ ఆదేశాలు జారీ చేసింది. కానీ ఈ కార్యక్రమానికి హాజరుకావడానికి ఎవరూ సిద్ధంగా లేనట్లు విశ్వసనీయ వర్గాల భోగట్టా. జిల్లా కాంగ్రెస్‌లో గత ఎన్నికల్లో పోటీ చేసిన నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు ఉంటుండగానే షర్మిల సమాంతర వ్యవస్థగా నియోజకవర్గ కోఆర్డినేటర్లను నియమించారు. దీంతో సిట్టింగ్ ఇన్‌ఛార్జిలంతా అప్పట్లోనే అసంతృప్తి వెలిబుచ్చారు. అంతేకాకుండా డీసీసీ అధ్యక్షుడిగా అంబటి కృష్ణను నియమించినప్పుడు జిల్లాలో ఎవరి అభిప్రాయాలను కూడా షర్మిల పరిగణనలోకి తీసుకోలేదన్న ఆరోపణలు కూడా వినిపించాయి. ఆ తర్వాత ఇందిరా విజ్ఞాన్ భవన్ కేంద్రంగా అనేక రాజకీయాలు నడిచాయి. చివరకు ఒకే పార్టీలో ఉన్న నాయకులు ఒకరి మీద ఒకరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకునేవరకు పరిస్థితి దిగజారిపోయింది. వీటిని సరిచేయాలని ఎన్నిసార్లు పీసీసీ అధ్యక్షురాలు షర్మిలకు విన్నవించినా ఫలితం లేకపోవడంతో ఎన్నికల అనంతరం జిల్లాలో నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు అసంతృప్తితో ఉన్నారు. ఇక్కడ జరుగుతున్న వ్యవహారాలను రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి మాణిక్యం ఠాకూర్ దృష్టిలో పెట్టాలని ఢిల్లీ వెళ్లిన కాంగ్రెస్ నేతలకు కనీసం ఆయన అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వలేదు. చివరకు కేంద్రమంత్రిగా పని చేసి ప్రస్తుతం కాంగ్రెస్‌లో టెక్కలి ఇన్‌ఛార్జిగా ఉన్న డాక్టర్ కిల్లి కృపారాణి ఠాకూర్‌కు ఎన్నిసార్లు ఫోన్ చేసినా కనీసం లిఫ్ట్ చేయలేదన్న ప్రచారం కూడా ఉంది. ఇటువంటి వాతావరణంలో ఉత్తరాంధ్రలో నిరసన కార్యక్రమం చేపట్టడానికి వస్తున్న కాంగ్రెస్ పెద్దల బృందానికి అసమ్మతి సెగ ఎలా ఉంటుందో చూపించాలని ఇక్కడి ఇన్‌ఛార్జిలు భావిస్తున్నారు. పాతపట్నం నుంచి కొప్పురోతు వెంకటరావు, టెక్కలి నుంచి డాక్టర్ కిల్లి కృపారాణి, ఆమదాలవలస నుంచి సనపల అన్నాజీరావు, నరసన్నపేట నుంచి మంత్రి నర్సింహారావు, ఎచ్చెర్ల నుంచి కరిమజ్జి మల్లేశ్వరరావు, పార్లమెంట్ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి పేడాడ పరమేశ్వరరావు, కిసాన్‌సెల్ అధ్యక్షుడు కోత మధుసూదనరావు, దళిత విభాగం అధ్యక్షుడు చింతాడ దిలీప్ లాంటి కాంగ్రెస్‌లో పదవులున్న నేతలెవరూ మాణిక్యం ఠాకూర్ కార్యక్రమానికి వెళ్లడంలేదని తెలిసింది. ఇచ్ఛాపురం ఇన్‌ఛార్జి వెళ్లే అవకాశాలు ఉన్నాయి. గడిచిన ఎన్నికల్లో పీసీసీ అధ్యక్షురాలిగా షర్మిల ఖర్చుల కోసం ఎక్కడా రూపాయి ఇవ్వలేదని, కాంగ్రెస్ ఓటుబ్యాంకు గతంలో కంటే పెరిగిందని చెప్పుకోడానికైనా పోల్‌మేనేజ్‌మెంట్ చేయడానికి సొమ్ములు లేకపోవడంతో బలహీనంగా ఉందన్న సంకేతం వెళ్లడానికి కారణం షర్మిలేనని వీరు భావిస్తున్నారు. ప్రస్తుతం షర్మిల వ్యవహార శైలిపై అసంతృప్తితో ఉన్నది శ్రీకాకుళం కాంగ్రెస్ నేతలు మాత్రమే కాదని తెలుస్తుంది. విజయనగరం డీసీసీ అధ్యక్షుడిగా ఉన్న కె.రమేష్, విశాఖపట్నం డీసీసీ అధ్యక్షుడిగా ఉన్న వజ్రపతి శ్రీను, అనకాపల్లి డీసీసీ అధ్యక్షుడు బొడ్డు శ్రీనులు కూడా అసంతృప్తిగానే ఉన్నారు. విశాఖపట్నంలో జరుగుతున్న నిరసన కార్యక్రమానికి పీసీసీ అధ్యక్షురాలు షర్మిల హాజరవుతున్నారు. కానీ విజయనగరం, శ్రీకాకుళం సమావేశాలకు ఆమె రావడంలేదని తెలిసింది. మరీ ముఖ్యంగా శ్రీకాకుళం అసమ్మతి సెగ ఎక్కువగా ఉందన్న విషయం ఆమెకు తెలుసు. పీసీసీ అధ్యక్షురాలిని మార్చాలని మొదట డిమాండ్ చేసింది జిల్లా కాంగ్రెస్ నేతలే. ఎన్నికలు జరిగిన ఆరు నెలల తర్వాత ఆమె వ్యవహార శైలిపై మిగిలినవారికి అసంతృప్తి పెరిగింది కానీ డీసీసీ అధ్యక్షుడి ఎన్నిక దగ్గర్నుంచి షర్మిలపై ఏఐసీసీకి ఇక్కడి నుంచి ఫిర్యాదులు వెళ్తునే ఉన్నాయి. తమ వినతులు వినడానికి కూడా సమయం కేటాయించని మాణిక్యం ఠాకూర్ ఇప్పుడు జిల్లాకు వస్తే ఎందుకు వెళ్లాలనే భావనలో కాంగ్రెస్ నేతలు ఉన్నారు. పార్టీ తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకించకుండా నిరసన కార్యక్రమాన్ని వేరేగా చేపట్టి ఇందిర విజ్ఞాన్‌భవన్‌లో నిర్వహించనున్న కాంగ్రెస్ నాయకుల సమావేశానికి మాత్రం గైర్హాజరు కావాలని వీరు భావిస్తున్నారు.

## ఎస్సీ కులగణనపై 12 వరకు అభ్యంతరాల స్వీకరణ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఎస్సీ కులగణనపై నిర్వహిస్తున్న అభ్యంతరాల (ఆడిట్ ప్రక్రియ) స్వీకరణ గడువును ఈ నెల 12 వరకు పొడిగిస్తున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ఈ నెల 7తో గడువు ముగియనుండటంతో మరో ఐదు రోజులు పొడిగిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసిందని కలెక్టర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్‌వోపీ విధివిధానాలు తెలుపుతూ ప్రభుత్వం 265 నెబరు జీవో విడుదల చేసినట్లు తెలిపారు. ఈ మేరకు ఈ నెల 12 వరకు కులగణనపై నిర్దేశిత ప్రాంతాల్లో సంబంధిత అధికారులు ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తారని, వాటి వివరాలను ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా 16వ తేదీ వరకు అధికారులు నమోదు చేస్తారని, అనంతరం అన్ని తనిఖీలు పూర్తిచేసి తుది కులగణన సర్వే వివరాలను 20న గ్రామ, వార్డు సచివాలయాల వద్ద విడుదల చేస్తారని వెల్లడించారు. మండల ప్రత్యేక అధికారులు సంబంధిత ప్రక్రియను పూర్తిస్థాయిలో పర్యవేక్షించాలని ప్రకటనలో ఆదేశించారు.

## విద్యార్థులను వ్యాపారవేత్తలుగా మలచాలి




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

విద్యార్థులను వ్యాపారవేత్తలుగా మలిచేందుకు అమలుచేస్తున్న ఈఎండీపీ ప్రోగ్రాంను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి తిరుమల చైతన్య ఉపాధ్యాయులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో జరుగుతున్న ఈఎండీపీ ఫెసిలిటేటర్ శిక్షణ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఉద్దేశించబడిన ఈ కార్యక్రమం నిర్దేశించిన పాఠశాలలో అమలు జరిపే బాధ్యత ఫెసిలిటేటర్‌పై ఉందన్నారు. ఈ కార్యక్రమ ఉద్దేశాలను, శిక్షణా లక్ష్యాలను ప్రాజెక్టు జిల్లా మేనేజర్ ఎ.అనూష శిక్షణ శిబిరంలో వివరించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్స్ పారుపల్లి శ్రీనివాసరావు, జి.భాగ్యలక్ష్మిలు ఎంటర్‌ప్రెన్యువల్ మైండ్‌సెట్ డెవలప్మెంట్ ప్రోగ్రాం విధివిధానాలను శిక్షణ అనంతర కార్యక్రమాలను తెలియజేశారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు తగిన నైపుణ్యాభివృద్ధి కల్పించి మార్చిలో నిర్వహించనున్న ఎక్స్‌పోకు ప్రాజెక్టులను సిద్ధం చేయాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలోని 40 ఉన్నత పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.








పదో తరగతి చదువుతున్న ఎం.లహరి నినాదాల తయారీలో ప్రథమ బహుమతి గెలుచుకుని రాష్ట్రీయంగా విజయవాడలో జరిగే పోటీలకు ఎన్నికైంది. హయాతినగరంలోని జ్యోతిరావు పూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల గురుకుల పాఠశాల విద్యార్థిని లహరిని ప్రిన్సిపాల్ జి.స్వరాజ్యలక్ష్మి హర్షం తెలిపారు.

- సత్యంన్యూస్, శ్రీకాకుళం

# డివైడర్ వద్దు.. సెంటర్ పార్కింగే ముద్దు!

ఎమ్మెల్యేకు వినతినివ్వడానికి సిద్ధపడుతున్న వ్యాపారులు । విశాలంగా కనిపిస్తున్న పాలకొండ రోడ్డు




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నగరంలో ఏడురోడ్ల జంక్షన్ నుంచి డే అండ్ నైట్ కూడలి వరకు ఉన్న కోనోకార్పస్ చెట్లను తొలగించి, ఆ ప్రాంతాన్ని సుందరీకరించడానికి కూటమి ప్రభుత్వం పూనుకోవడం హర్షించదగ్గ పరిణామం. అయితే 2000-2005 మధ్య టీడీపీ హయాంలో పాలకొండ రోడ్డు వెడల్పయిన తర్వాత అప్పటి వరకు సెమీ కమర్షియల్ జోన్‌గా ఉన్న ఈ ప్రాంతం పూర్తి కమర్షియల్ ఏరియాగా మారింది. ఇందులో భాగంగానే ప్రధాన రహదారికి ఇరువైపులా షాపులు వచ్చాయి. ఆ మేరకు మున్సిపాలిటీ అనుమతులు కూడా మంజూరు చేసింది. పాలకొండ రోడ్డు వెడల్పు చేసినప్పుడు భవనాలు, స్థలాలు కొంతమేర కోల్పోయినవారికి టౌన్‌ప్లానింగ్ నిబంధనలు సడలించి వెడల్పయిన రోడ్డుకు ఆనుకొని కమర్షియల్ నిర్మాణాలు చేపట్టుకోవచ్చని వెసులుబాటు కల్పించింది. ఇంతవరకు బాగానే ఉన్నా విస్తరించిన నగరంలో షాపులు పెరిగి పార్కింగ్ ప్రధాన సమస్యగా మారింది. జీటీ రోడ్డులో, రద్దీ సమయాల్లో కళింగ రోడ్డులో సెంటర్ పార్కింగ్‌ను అమలుచేయడం వల్ల కనీసం ఆ రోడ్లలో నడవగలుగుతున్నాం. ఇప్పుడు కోనోకార్పస్ చెట్లను తొలగించి సెంటర్ డివైడర్‌ను వెడల్పు చేసి, అందులో అందంగా ఉండే మొక్కలు పెంచడం వల్ల పాలకొండ రోడ్డు కొత్త సొబగులు చేకూరవచ్చు. కానీ ఇక్కడ పార్కింగ్ పరిస్థితి ఏమిటనే ఆందోళన స్థానిక వ్యాపారుల నుంచి వ్యక్తమవుతోంది. ఇప్పటికే 2014-19 మధ్యలో ఉడా నిధులు సమకూర్చిందని ఈ రోడ్డుకు రెండు వైపులా ఫుట్‌పాత్‌లు నిర్మించారు. ఒకవైపు ఫుట్‌పాత్‌లు పోగా, మరోవైపు డివైడర్ ఉంటే పార్కింగ్ కష్టతరమవుతుందన్న విషయం పాలకులు గుర్తించాలని వ్యాపారస్తులు కోరుతున్నారు. ఇందులో భాగంగానే తమ వ్యాపారాలకు, పాలకొండ రోడ్డు వెలుగుకు అడ్డంకిగా ఇన్నాళ్లూ మారిన కోనోకార్పస్ చెట్లను తొలగించినందుకు ధన్యవాదాలు చెబుతునే సెంటర్‌పార్కింగ్ ఏర్పాటుపై ఆలోచించాలని కోరుతూ ఎమ్మెల్యే గొండు శంకర్‌కు వినతిపత్రం ఇవ్వడానికి ఇక్కడి వ్యాపారులు సిద్ధమవుతున్నారు. ఈమేరకు గురువారం స్థానిక వరం రెసిడెన్సీలో పాలకొండ రోడ్డు వ్యాపారస్తులు సమావేశం నిర్వహించనున్నారు. కొన్నిచోట్ల మొక్కలు ఏర్పాటుచేసి, మిగిలినచోట్ల సెంటర్ పార్కింగ్ కోసం అవకాశం ఇవ్వాలని వీరు కోరుతున్నారు. వాస్తవానికి పాలకొండ రోడ్డుకు పార్కింగ్ సదుపాయం లేదు. ఈ ప్రాంతంలో ఉన్న రెండు కల్యాణ మండపాలు, కోదండరామస్వామి కోవెలలో శ్రీరామనవమి, ముక్కోటి ఏకాదశి, తిరుప్పావై వంటి కార్యక్రమాలు జరుపుతున్నప్పుడు వాహనాలు ఎక్కడ పెడుతున్నారో కార్పొరేషన్ అధికారులకు తెలుసు. జీటీ రోడ్డు ఈ రోజు శ్రీకాకుళం అబిడ్స్ సెంటర్‌గా తయారైందంటే అందుకు కారణం పార్కింగ్ సదుపాయం ఉండటమే. పాలకొండ రోడ్డుకు అంతమేర పార్కింగ్ ఇవ్వనవసరం లేదు కానీ, అందులో మూడోవంతు కల్పిస్తే సరిపోతుంది. మరోవైపు కోనోకార్పస్ చెట్లు తొలగించిన తర్వాత అవి భూమి లోతుల్లోకి ఏమేరకు వెళ్లిందో ఇప్పుడు అధికారులకు అర్థమవుతుంది. కొన్నాళ్ల నుంచి కృష్ణాపార్క్ డౌన్ ప్రాంతంలో సైతం బోర్ల నుంచి నీరు వచ్చేది కాదు. నాగావళికి వరదొస్తే ముందుగా మునిగిపోయే సున్నపువీధి, బాలభాను స్కూల్ రోడ్డు వంటి ప్రాంతాల్లో సైతం బోర్లు ఎండిపోవడం ఏమిటనేది ఎవరికీ అర్థం కాలేదు. ఇప్పుడు కోనోకార్పస్ చెట్లు తొలగించిన తర్వాత వాటి మొదళ్లు (వేళ్లు) ఏమేరకు భూగర్భ జలాలను తాగేశాయో అర్థమవుతుంది. అప్పట్లో మొదటిగా విస్తరణకు నోచుకున్నది పాలకొండ రోడ్డే. 40 అడుగులు వెడల్పు అవుతుందంట అంటూ గొప్పగా చెప్పుకునేవారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో 40 అడుగులు ఏమాత్రమూ కాదు. కానీ చెట్లు తొలగించిన తర్వాత డివైడర్లను తవ్వుతున్న తర్వాత రోడ్డు ఇంత విశాలంగా ఉందా అని సిక్కోలువాసులు ఆశ్చర్యపోతున్నారు. ఏది ఏమైనా 40 అడుగులు అవసరాలకు సరిపోదు కాబట్టి పార్కింగ్ సెంటర్ చేసి డివైడర్ లేకుండా చూస్తేగాని సమస్యకు పరిష్కారం దొరకదు. దీన్నే ఇక్కడి వ్యాపారస్తులు కూడా కోరుకుంటున్నారు.

## ఇంటర్ మొదటి ఏడాది పరీక్షలు రద్దు!

(సత్యంన్యూస్, అమరావతి)

ఇంటర్ విద్యలో ఏపీ సర్కార్ సంస్కరణలు తీసుకొస్తోంది. ఇందులో భాగంగా ఇంటర్ మొదటి ఏడాది పరీక్షల్ని రద్దు చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. అలాగే ఇంటర్ సిలబస్‌లో పెనుమార్పులు తీసుకురావాలని విద్యాశాఖ నిర్ణయించడం విశేషం. ఈ వివరాలను ఇంటర్‌బోర్డు కార్యదర్శి కృతికా శుక్లా తెలిపారు. ప్రభుత్వం తీసుకురావాలని అనుకుంటున్న మార్పుల గురించి కృతికా శుక్లా వెల్లడించారు. ఇంటర్ మొదటి ఏడాది పరీక్షల్ని కాలేజీలో ఇంటర్నల్‌గా నిర్వహిస్తామని తెలిపారు. ప్రతి సబ్జెక్ట్‌లో 20 మార్కులు ఇంటర్నల్‌గా వుంటాయని, రెండో ఏడాది పరీక్షల్లో వచ్చే మార్కుల్ని మాత్రమే పరిగణలో తీసుకోనున్నారని వెల్లడించారు. ఇక ఇంటర్ సిలబస్ విషయానికి వస్తే.. సీబీఎస్‌ఈ సిలబస్‌ను ప్రవేశపెట్టాలని అనుకుంటున్నారు. విద్యార్థులు, విద్యావంతులు, మేధావుల అభిప్రాయాల్ని తీసుకోనున్నారు. మొదటి ఏడాదిలో ఇంగ్లీష్, తెలుగు సిలబస్ మార్చనున్నట్టు చెప్పారు.

# దారులన్నీ ప్రధాని సభ వైపు

- శ్రీకాకుళం నియోజకవర్గం నుంచి 87 ఆర్టీసీ బస్సులు
- కిష్టప్పపేటలో జండా ఊపి ప్రారంభించిన ఎమ్మెల్యే శంకర్




(సత్యంన్యూస్, శ్రీకాకుళం రూరల్)

విశాఖపట్నంలో నిర్వహిస్తున్న ప్రధాని మంత్రి సభ వైపే శ్రీకాకుళం జిల్లా ప్రజలంతా పయనమయ్యారు. నియోజకవర్గం నుంచి 87 బస్సుల్లో సుమారు 5వేల మంది విశాపట్నం సభకు వెళ్తున్నారు. ఈ సభకు వెళ్లే బస్సులను కిష్టప్పపేట గ్రామంలో ఎమ్మెల్యే గొండు శంకర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ ఎన్డీయే ప్రభుత్వంతో దేశాభివృద్ధి సాధ్యమని చెప్పారు. దేశంలో, రాష్ట్రంలో ఎన్డీయే పాలనలో ప్రజారంజక పాలన అందుతోందని తెలిపారు. ప్రధాన మంత్రి ఈ సభ ద్వారా విశాఖ రైల్వేజోన్ ప్రధాన కార్యాలయం నిర్మాణంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా రూ.2లక్షల కోట్లకు పైగా అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. ఇటువంటి సభ న భూతో న భవిష్యత్‌గా రాజకీయ చరిత్రలో నిలిచిపోతుందన్నారు. 2047 వికసిత్ భారత్ లక్ష్యంగా ప్రధాని మోడీ, సీఎం చంద్రబాబునాయుడు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని వివరించారు. వీరి సంస్కరణలతో పేదలకు లబ్ధి కలుగుతుందని, అంతిమయంగా ప్రజల జీవన ప్రమాణాలు పెంచడమే లక్ష్యమని చెప్పారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.